మన రాజధాని
**రక్షణ**
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
మంగళవారం 7 ఏప్రిల్ 2026
పేజీలు : 4

# బాపట్ల అభివృద్ధికి లోకేష్ భరోసా



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంపూర్ణ సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు, బాపట్ల పార్ల మెంటు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సలగల రాజశేఖర్ బాబు కలిసి మంత్రిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భ ంగా నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ

మిగతా 2 లో

# కలెక్టర్ దృష్టికి రాని అవినీతి?

## చెరుకూరులో రెవెన్యూ అవినీతి...



- పాస్‌బుక్ నుంచి ఫ్యామిలీ సర్టిఫికెట్ వరకు రేట్ల పర్వం
- సేవల పేరుతో వేల రూపాయల వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు
- పాస్‌బుక్‌కు 7--10 వేలు... ఫ్యామిలీ సర్టిఫికెట్‌కు 10 వేలు వరకు డిమాండ్

ఫిర్యాదులు కలెక్టర్ కార్యాలయానికి చేరినా చర్యలపై సందేహాలు

- బీసీ, ఎస్సీ, ఎస్టీ గ్రామం కావడమేనా నిర్లక్ష్యానికి కారణమని ప్రజల ప్రశ్న

రెవెన్యూ వ్యవస్థలో సంస్కరణలు తీసుకువచ్చామని ప్రభుత్వం ప్రకటిస్తున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు పంచాయతీలో వెలుగులోకి వస్తున్న అవినీతి ఆరోపణలు ఆ వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. పాస్‌బుక్, ఫ్యామిలీ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్ వంటి సాధారణ సేవలకు కూడా వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు గ్రామంలో తీవ్ర ఆందోళనకు దారి తీస్తున్నాయి.

పలు ఫిర్యాదులు కలెక్టర్ కార్యాలయానికి చేరినా ఇప్పటి వరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. రెవెన్యూ సేవలు ప్రజల చేతుల్లోనే ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా, చెరుకూరులో మాత్రం ఆ సేవలు డబ్బుల చుట్టూ తిరుగుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వివరాలు 2లో..

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

# పల్నాడులో వైద్య సేవలకు శ్రీకారం

- 2026లో ఎంబీబీఎస్ ప్రవేశాలు ప్రారంభం
- 100 సీట్లతో సేవలకు సిద్ధం



2లో.

పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాల 2026-27 విద్యాసంవత్సరం నుంచి 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రారంభంకానుంది అని అధికారులు తెలిపారు.

**పిడుగురాళ్ల రక్షణ న్యూస్**

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

- రాయపూడి పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లపై అధికారులకు సూచనలు
- రూ.252.86 కోట్లతో కొనుగోలు చేసిన ఆధునిక అగ్నిమాపక వాహనాల ప్రారంభం



గుంటూరు జిల్లా రాయపూడి పెరేడ్ గ్రౌండ్‌లో మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు.

**గుంటూరు, రక్షణ న్యూస్**

వివరాలు 2లో..

# బాపట్లలో జిల్లాస్థాయి బడ్జెట్ సమావేశం

## పాల్గొన్న జిల్లా ఇన్చార్జి మంత్రి పార్ధసారథి



బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి బడ్జెట్ 2026--27 సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి , జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌లతో కలిసి బాపట్ల శాసనసభ్యుడు వేగెసిన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు.

వివరాలు 2లో..

**బాపట్ల రక్షణ న్యూస్**

## బాపట్ల అభివృద్ధికి లోకేష్ భరోసా

మొదటి పేజీ తరువాయి

బలోపేతానికి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ మంత్రికి వివరించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని, అదే ఉత్సాహంతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన అన్నారు. నాయకులు సమన్వయంతో పని చేసి కేడర్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సూర్యలంకలో జరుగుతున్న పర్యాటక అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించగా, రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సహకరిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే విన్నవించగా, సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్ పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు.

## పల్నాడులో వైద్య సేవలకు శ్రీకారం

మొదటి పేజీ తరువాయి

**పిడుగురాళ్ల రక్షణ న్యూస్**

పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో నిర్మాణం పూర్తికి చేరుకున్న నూతన ప్రభుత్వ వైద్య కళాశాల త్వరలో ప్రజలకు అందుబాటులోకి రానుంది. 2026-27 విద్యా సంవత్సరం నుంచే 100 ఎంబీబీఎస్ సీట్లతో ప్రవేశాలు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా ఇంచార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కళాశాలను సందర్శించి పనులను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రగతిపై చర్చించారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ అభివృద్ధిని ఆలస్యం చేశారని ఆరోపించారు. ఎంపీ లావు అమరావతి రాజధాని అంశంపై వైసీపీ వైఖరిని తప్పుపట్టారు. ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ ఈ కళాశాల పల్నాడు ప్రాంత ప్రజలకు వరమని తెలిపారు. ఇప్పటికే 95 శాతం పనులు పూర్తయ్యాయని, ఏప్రిల్ 15 నుంచి పూర్తిస్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడంతో పాటు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని నాయకులు పేర్కొన్నారు.

## బాపట్లలో జిల్లాస్థాయి బడ్జెట్ సమావేశం

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి బడ్జెట్ 2026--27 సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇంచార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్‌లతో కలిసి బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యుడు వేగేసిన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు.
సమావేశంలో బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణ ప్రసాద్ , చీరాల నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దులూరి మాల కొండయ్య , బాపట్ల పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ సలగల రాజశేఖర్, ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి సంబంధించి బడ్జెట్ కేటాయింపులు, వివిధ శాఖల పనితీరు, ప్రజలకు అందించాల్సిన సేవలపై చర్చించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థంగా అమలు చేసి ప్రజలకు చేరవేయాలని అధికారులు నిర్ణయించారు. సమావేశంలో జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# కలెక్టర్ దృష్టికి రాని అవినీతి?

మొదటి పేజీ తరువాయి

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలోని చెరుకూరు పంచాయతీలో రెవెన్యూ వ్యవస్థపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వ సేవల పేరుతో సాధారణ ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఇప్పుడు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి. పాస్‌బుక్ నుంచి ఫ్యామిలీ సర్టిఫికెట్ వరకు ప్రతి సేవకు ఒక నిర్దిష్ట రేటు ఉందన్న ఆరోపణలు వినిపించడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం ఒక పాస్‌బుక్ ఇవ్వాలంటే సుమారు 7,000 నుంచి 10,000 రూపాయలు వరకు డిమాండ్ చేస్తున్నారని చెబుతున్నారు. అలాగే ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇవ్వాలంటే 10,000 రూపాయల వరకు తీసుకుంటున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఇన్కమ్ సర్టిఫికెట్ కోసం కూడా 3,000 నుంచి 5,000 రూపాయలు వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉచితంగా లేదా స్వల్ప రుసుముతో అందాల్సిన సేవలు ఈ విధంగా భారీ మొత్తాల కోసం బేరసారాలు జరుగుతున్నాయన్న విషయం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. పంచాయతీ స్థాయిలో అభివృద్ధి పనులపై ఇప్పటికే అనుమానాలు వ్యక్తమవుతున్న సమయంలో రెవెన్యూ వ్యవస్థపై కూడా ఇలాంటి ఆరోపణలు రావడం చెరుకూరు ప్రజలను మరింత ఆగ్రహానికి గురిచేస్తోంది. గ్రామస్తుల మాటల్లో ఇటు పంచాయతీ అధికారులు, అటు రెవెన్యూ అధికారులు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న భావన బలపడుతోంది. ఏదైనా ప్రశ్నిస్తే వివిధ రకాల ఒత్తిళ్లు తెస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. రక్షణ దినపత్రికతో మాట్లాడిన కొంతమంది గ్రామస్తులు తమ అనుభవాలను వెల్లడించారు. ఒక వృద్ధురాలు పాస్‌బుక్ కోసం 7,000 రూపాయలు ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే మూడు నెలలు గడిచినా ఇప్పటివరకు ఆమెకు పాస్‌బుక్ అందలేదని, "చెన్నై నుంచి రావాలి" అని చెప్పుతూ తిప్పిస్తున్నారని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. ఆ వృద్ధురాలు ఎవరిని అడగాలో తెలియక తీవ్ర ఇబ్బందులకు గురవుతోందని తెలిపారు. ఇంకా ఒక ప్రభుత్వ ఉద్యోగి కూడా పాస్‌బుక్ కోసం సుమారు 10,000 రూపాయలు ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు నెలలు గడిచినా పాస్‌బుక్ అందకపోవడంతో ఆయన కూడా తీవ్ర నిరాశకు గురయ్యాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఇదే సమయంలో తండ్రి మరణంతో ఇబ్బందులు పడుతున్న ఒక కుటుంబం దగ్గర ఫ్యామిలీ సర్టిఫికెట్ పేరుతో కూడా డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనలు ఒక్కటి రెండు మాత్రమే కాకుండా గ్రామంలో అనేక కుటుంబాలు ఇలాంటి అనుభవాలను ఎదుర్కొంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ప్రతి ఇంటికి ఒక కథ ఉందన్నట్లుగా పరిస్థితి ఉందని వారు పేర్కొంటున్నారు. ముఖ్యంగా గ్రామంలో ఎక్కువగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు ఉండటం వల్లనే తమ సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా ఈ వ్యవహారంపై పలు ఫిర్యాదులు కలెక్టర్ కార్యాలయానికి చేరినట్లు తెలుస్తోంది. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవాన్స్ రెడ్రెస్సల్ సిస్టం )లో కూడా పలు ఫిర్యాదులు నమోదైనట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఆ ఫిర్యాదులపై సరైన విచారణ జరుగుతుందా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని ఫిర్యాదులు విచారణ లేకుండానే మూసివేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.
ప్రజా సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్ ఒక సమర్థ వేదిక అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ చెరుకూరులో మాత్రం ఆ వ్యవస్థ ఎలా పనిచేస్తోందన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి. ఒక పంచాయతీకి సంబంధించిన ఫిర్యాదులు కూడా సరైన దిశలో పరిష్కారం కాకపోతే జిల్లా ప్రజలు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలి అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
రెవెన్యూ సేవలు ప్రజల చేతుల్లోనే ఉండాలని ప్రభుత్వం ప్రకటిస్తున్న ఈ సమయంలో చెరుకూరులో వెలుగులోకి వస్తున్న ఈ ఆరోపణలు ఆ వ్యవస్థపై నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని పలువురు భావిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, రక్షణ న్యూస్**

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం రాయపూడి పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న కార్యక్రమం నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సి.యం. సాయి కాంత్ వర్మ సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె. మయూర్ అశోక్, సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ, జిల్లా పోలీసు అధికారి వకుల్ జిందాల్‌లతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని అధికారులకు సూచించారు. 15వ ఆర్థిక సంఘం కింద అగ్నిమాపక సేవల ఆధునికీకరణ కోసం గ్రాంట్-ఇన్-ఎయిడ్ పథకం ద్వారా మంజూరైన రూ.252.86 కోట్లతో రాష్ట్ర విపత్తు నిర్వహణ మరియు అగ్నిమాపక సేవల శాఖకు ఆధునిక అగ్నిమాపక వాహనాలు, పరికరాలను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు. వీటిని ముఖ్యమంత్రి మంగళవారం ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా అడ్వాన్స్ వాటర్ టెండర్లు 25, హై ప్రెజర్ పంపుతో క్విక్ రెస్పాన్స్ వాహనాలు 40, ఇన్‌ఫ్లేటబుల్ రబ్బర్ పడవలు 50, బిఏ సెట్ కంప్రెసర్లు 30 కొనుగోలు చేసినట్లు తెలిపారు. అగ్నిమాపక కేంద్రాల నిర్మాణం, శిక్షణా సాధనాల కొనుగోలు వంటి అంశాలు కూడా ఇందులో భాగంగా ఉన్నాయి. వేసవి కాలంలో అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఈ ఆధునిక వాహనాలు, పరికరాలు ఉపయోగపడతాయని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక మౌలిక సదుపాయాలు బలపడటంతో పాటు అత్యవసర స్పందన సామర్థ్యం గణనీయంగా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె. విజయలక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి బి.వి. రంగారావు, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె. కళ్యాణ చక్రవర్తి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి. విజయలక్ష్మి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వి. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

7- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/7/2026 5:02 AM Page 3



# ముస్లింలపై వ్యతిరేకతతో యుద్ధాన్ని సమర్థించరాదు

**: డా. పి.వి. రమేష్**

**గుంటూరు, రక్షణ న్యూస్ :**

ముస్లింలపై వ్యతిరేక భావనతో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు చేస్తున్న దాడులను సమర్థించడం సరికాదని, ఆ దాడులను భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటివరకు ఖండించకపోవడం దురదృష్టకరమని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.వి. రమేష్ అన్నారు.గుంటూరులోని జనచైతన్య వేదిక సమావేశ మందిరంలో "ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయిల్ దాడులు : ప్రపంచ దేశాలపై ప్రభావం" అనే అంశంపై జరిగిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా పాల్గొన్నారు. కార్యక్రమానికి జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ పి.వి. రమేష్ మాట్లాడుతూ ప్రపంచంపై ఆధిపత్యాన్ని కొనసాగించడానికి, అమెరికా డాలర్ విలువను బలపరుచుకోవడానికి, అలాగే ఆయుధ పరిశ్రమలను ప్రోత్సహించడానికి అమెరికా దేశం ఇరాన్‌పై దాడులకు పాల్పడుతోందని తెలిపారు. ఇరాన్ దేశానికి వేల సంవత్సరాల నాగరికత చరిత్ర ఉందని, పాలనా వికేంద్రీకరణకు కూడా ఆ దేశం నాంది పలికిందని వివరించారు.ఇరాన్‌ను 31 ప్రాంతాలుగా విభజించి ఆయా ప్రాంతాలకు తగిన సైన్యం, ఆయుధాలను అందించడం వల్లే అమెరికా, ఇజ్రాయిల్ దాడులను సమర్థంగా ఎదుర్కొనే స్థితి ఆ దేశానికి ఏర్పడిందన్నారు. మరోవైపు పాకిస్తాన్ వంటి దేశాలు యుద్ధాన్ని నివారించేందుకు మధ్యవర్తిత్వం చేయడానికి ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా ఈ యుద్ధ ప్రభావం కనిపిస్తున్నదని, ముఖ్యంగా చమురు, వాయువు, ఎరువులు, హీలియం వంటి వనరుల కొరతతో ధరలు విపరీతంగా పెరిగి ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఇజ్రాయిల్ దేశం వద్ద సుమారు 90 అణు బాంబులు, అమెరికా దేశం వద్ద నాలుగు వేలకుపైగా అణు బాంబులు ఉండటం వల్ల ఇరాన్‌పై ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు.అమెరికా దేశంలో లక్షలాది మంది ప్రజలు యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారని, అక్కడి ప్రజల్లో 60 శాతం కంటే ఎక్కువ మంది యుద్ధానికి వ్యతిరేకంగా ఉన్నారని వివరించారు. అలాగే యూరప్ దేశాలు, ఉత్తర అట్లాంటిక్ ఒప్పంద సంస్థకు చెందిన దేశాలు కూడా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్




చర్యలను ఖండిస్తున్నాయని పేర్కొన్నారు. ఐక్యరాజ్యసమితి బలహీనపడటంతో యుద్ధ నివారణకు సరైన చర్యలు తీసుకోలేకపోతున్నదని కూడా తెలిపారు.జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ఇటీవల కాలంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలు ప్రపంచ శాంతికి ముప్పుగా మారుతున్నాయని విమర్శించారు. వెనిజులా దేశంపై దాడి చేసి ఆ దేశ అధ్యక్షుడిని పట్టుకుని వెళ్లడం, ఆ దేశ చమురు వనరులపై ఆధిపత్యం సాధించాలనే ప్రయత్నాలు చేయడం వంటి చర్యలు ప్రపంచాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. అలాగే ఉక్రెయిన్ యుద్ధంలో ఆ దేశ ఖనిజ సంపదపై ఆశలు పెట్టుకోవడం, గ్రీన్‌లాండ్‌ను ఆక్రమించుకోవాలనే ప్రయత్నాలు చేయడం, కెనడాను అమెరికా దేశంలో భాగంగా చేసుకోవాలని మాట్లాడడం వంటి అంశాలను ఆయన ప్రస్తావించారు.మాజీ మంత్రి డొక్కా మాణిక్యం వరప్రసాద్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ దేశం ప్రపంచానికి అణు బాంబు బులాంటి ప్రమాదంగా మారుతోందని, వారి రాజ్య విస్తరణ కాంక్ష ప్రపంచాన్ని ప్రమాదంలో నెడుతోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, మాజీ శాసనసభ్యుడు లింగం శెట్టి ఈశ్వరరావు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి, మానవత కోశాధికారి టి.వి. సాయిరాం, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ విశ్రాంత ప్రధాన నిర్వాహకుడు పోలూరి వీరారెడ్డి, వుయ్ ఆర్ విత్ యు సంస్థ అధ్యక్షుడు శిగినం అయ్యప్ప, విశ్రాంత అదనపు పోలీసు అధికారి కె.వి. చలపతిరావు, రేటు చెల్లింపుదారుల సంఘం అధ్యక్షుడు ఒరుగంటి నారాయణ రెడ్డి, కోవిడ్ ఫైటర్స్ వ్యవస్థాపకుడు పఠాన్ అల్లా బక్షు, ఎస్.ఆర్. శంకరన్ నిరుపేదల సంఘం అధ్యక్షుడు బత్తుల కోటేశ్వరరావు, తెలుగు భాషోద్యమ నేత డాక్టర్ వి. సింగారావు, కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు సుధీర్ బాబు పాల్గొన్నారు.

# 9న ముఖ్యమంత్రి పర్యటన మండలాల వారీగా పార్టీ సమావేశాలు

**వేమూరు రక్షణ న్యూస్**

వేమూరు నియోజకవర్గంలో ఈనెల 9వ తేదీన జరగనున్న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేయడానికి మండలాల వారీగా పార్టీ సమావేశాలు నిర్వహించినట్లు వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్క ఆనంద బాబు తెలిపారు.భట్టిప్రోలు -- సురేపల్లి గ్రామాల మధ్య వేమవరం వద్ద ఏర్పాటు చేయనున్న ప్రజావేదికలో ముఖ్యమంత్రి పాల్గొననున్న కార్యక్రమం నేపథ్యంలో ఏర్పాట్లు, సమన్వయంపై అత్యవసరంగా ఈ సమావేశాలు నిర్వహించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా భట్టిప్రోలు మండలం పార్టీ సమావేశం భట్టిప్రోలు మార్కెట్ యార్డ్‌లో, కొల్లూరు మండలం సమావేశం క్లబ్--ఎంప్లాయిస్ రిక్రియేషన్ హాల్‌లో, వేమూరు మండలం సమావేశం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడినట్లు పేర్కొన్నారు .సమావేశాల్లో ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రజావేదిక ఏర్పాట్లు, ట్రాఫిక్ మరియు భద్రతా చర్యలు, కార్యకర్తల సమీకరణ, గ్రామాల వారీగా ప్రజల తరలింపు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి బాధ్యతల పంపిణీ, నాయకుల సమన్వయం, వేదిక అలంకరణ, స్వాగత ఏర్పాట్లు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించినట్లు



తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ శ్రేణులను ఉద్దేశించి నక్క ఆనంద బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను వేమూరు నియోజకవర్గ గౌరవాన్ని ప్రతిబింబించేలా చారిత్రాత్మక విజయంగా నిలపాలని, ప్రతి నాయకుడు, కార్యకర్త తనకు అప్పగించిన బాధ్యతలను కట్టుదిట్టంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశాలకు మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ స్థాయి ఇంచార్జ్‌లు, అనుబంధ సంఘాల నాయకులు, యువత, మహిళా విభాగ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంకల్పించారు.

# అన్నదాతల ఆవేదన

**ప్రత్తిపాడు రక్షణ న్యూస్**




గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం పెదనందిపాడు మండల కేంద్రంలో రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. రైతు సంఘ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో భారీగా చేరుకున్న రైతులు తమ సమస్యలను వ్యక్తం చేస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ, ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతుల పరిస్థితిలో మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరను అమలు చేయకపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. క్వింటాల్‌కు రూ.2400 మద్దతు ధర ప్రకటించినప్పటికీ, మార్కెట్‌లో దళారులు రూ.1500 నుంచి రూ.1700 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి, మండల కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల నుంచి నేరుగా పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. దళారీ వ్యవస్థను పూర్తిగా నియంత్రించి, రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఇప్పటికే పంటను అమ్మకానికి తీసుకొచ్చిన రైతులు తక్కువ ధరలకు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల అప్పుల్లో కూరుకుపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని, మద్దతు ధరకు కొనుగోలు చేపట్టకపోతే రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు, రైతు సంఘ నాయకులు పాల్గొన్నారు.

# నగర స్వచ్ఛత పై దృష్టి



**గుంటూరు రక్షణ న్యూస్**

గుంటూరు నగరంలో భవన నిర్మాణ వ్యర్థాల సమస్యపై నగరపాలక సంస్థ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాల మేరకు నగరవ్యాప్తంగా వారం రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ప్రధాన రహదారులు, అంతర్గత వీధులు, ఖాళీ స్థలాలలో పేరుకుపోయిన నిర్మాణ వ్యర్థాలను పూర్తిగా తొలగించనున్నారు.సోమవారం నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో కమిషనర్ మాట్లాడుతూ, ప్రజారోగ్య మరియు పట్టణ ప్రణాళిక విభాగాలు సమన్వయంతో పని చేసి లక్ష్యాన్ని నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి వార్డులో సచివాలయ కార్యదర్శులు తమ పరిధిలోని రోడ్లపై ఉన్న వ్యర్థాలను గుర్తించి, వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భవన నిర్మాణ యజమానులు, కాంట్రాక్టర్లు రహదారుల పక్కన, డ్రైనేజీ కాలువల్లో మట్టి, రాళ్లు, ఇటుకలు పారబోయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, పారిశుధ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొన్నారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణ వ్యర్థాలు వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుము విధించనున్నట్లు హెచ్చరించారు.క్షేత్రస్థాయిలో నిఘా పెంచి నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. నిర్మాణ వ్యర్థాలను నిర్దేశించిన ప్రదేశాలకు మాత్రమే తరలించాలని, అవసరమైతే నగరపాలక సంస్థ సేవలను వినియోగించుకోవాలని ప్రజలకు సూచించారు.

7- 4- 26 rakshana_praja jyothi Medhak.qxd 4/7/2026 5:02 AM Page 4



# "నీటి భద్రత -- సాగు నీటి సంఘాల బాధ్యత"

కొల్లూరు రక్షణ న్యూస్



బాపట్ల జిల్లా కొల్లూరు మండలం కొల్లూరు గ్రామంలోని లాక్ సెంటర్ వద్ద "నీటి భద్రత -- సాగు నీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్క ఆనంద బాబు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల పునరుద్ధరణ, కాలువల అనుసంధానం, భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో వేగవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు సమృద్ధిగా అందేలా గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరులను పరిరక్షించడం అత్యంత అవసరమని తెలిపారు. వేమూరు నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ద్వారా రైతులకు సాగునీటి భద్రత పెరగడంతో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, భూగర్భ జలాల స్థాయిల పెరుగుదలకు, భవిష్యత్ తరాలకు నీటి వనరుల సంరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సాగు నీటి సంఘాలను మరింత బలోపేతం చేసి ప్రతి చెరువు, ప్రతి కాలువ, ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, రైతులు, సాగు నీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బాలవనం పార్కును ప్రారంభించిన మంత్రి

**చిన్నారుల కోసం ప్రత్యేక వేదిక.**

**పట్టణానికి పచ్చని వాతావరణం.**



బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల పట్టణ 9వ వార్డు చిల్లరగోల్లపాలెం గుంటూరు బ్రిడ్జి కింద ఖాళీ స్థలాన్ని సుందరీకరించి రూపొందించిన ఈ పార్కును రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సమక్షంలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు, ముఖ్యంగా చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో బాలవనం ఏర్పాటు చేశామని తెలిపారు. వాడుకలో లేని స్థలాలను అభివృద్ధి చేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా మార్చడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాబోయే రోజుల్లో బాపట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. పార్కులో ఏర్పాటు చేసిన సదుపాయాలను పరిశీలించిన నాయకులు, అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, ఆర్డీఓ గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తాసిల్దార్ సలీమా, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అధికారులు పాల్గొన్నారు.

# సత్తెనపల్లిలో బడ్జెట్ అవుట్‌రీచ్ కార్యక్రమం

సత్తెనపల్లి రక్షణ న్యూస్




పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో బడ్జెట్ అవుట్‌రీచ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సత్తెనపల్లి నియోజకవర్గ శాసన సభ్యుడు కన్నా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆర్డీవో కార్యక్రమానికి అధ్యక్షత వహించి బడ్జెట్ ముఖ్యాంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో సత్తెనపల్లి నియోజకవర్గానికి గణనీయమైన ప్రాధాన్యత లభించిందని తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం సత్తెనపల్లి నియోజకవర్గం మొత్తం స్థూల విలువ ఆధారిత ఉత్పత్తి (జీవీఏ) రూ.4,666 కోట్లుగా నమోదైంది. ఇది పల్నాడు జిల్లాలో 12 శాతం వాటాను, రాష్ట్ర స్థాయిలో 0.35 శాతం వాటాను కలిగి ఉంది. వ్యవసాయం రూ.2,009 కోట్లు, పరిశ్రమలు రూ.903 కోట్లు, సేవల రంగం రూ.1,754 కోట్లుగా ఉన్నట్లు తెలిపారు. ప్రధాన ఉపరంగాలలో పశుసంవర్ధక రంగం 21.3 శాతం, ఉద్యానవనం 16.7 శాతం, నిర్మాణ రంగం 10.8 శాతం, రియల్ ఎస్టేట్ మరియు సేవల రంగం 10.6 శాతం వాటా కలిగి ఉన్నట్లు వివరించారు. నిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాల్లో 20 శాతం పైగా వృద్ధి అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. 2026--27 బడ్జెట్‌లో సత్తెనపల్లి నియోజకవర్గానికి మొత్తం రూ.308 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇందులో పంచాయతీ రాజ్ మరియు గ్రామీణ అభివృద్ధికి రూ.91 కోట్లు, మహిళలు, బాలలు, దివ్యాంగులు మరియు వృద్ధులకు రూ.26 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.24 కోట్లు, విద్యకు రూ.22 కోట్లు, పశుసంవర్ధక, పాల ఉత్పత్తి మరియు మత్స్య రంగానికి రూ.6 కోట్లు, వ్యవసాయానికి రూ.4 కోట్లు, ఉద్యానవనానికి రూ.2 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల కింద ఎన్టీఆర్ భరోసా పథకానికి రూ.203 కోట్లు, తల్లికి వందనం పథకానికి రూ.56 కోట్లు, అన్నదాత సుఖీభవ పథకానికి రూ.52 కోట్లు, దీపం-2 పథకానికి రూ.13 కోట్లు, స్త్రీ శక్తి పథకానికి రూ.10 కోట్లు, ఆటో డ్రైవర్ల సేవలో పథకానికి రూ.2 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల అమలు, బడ్జెట్ ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో సమన్వయంతో పనిచేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ బడ్జెట్ ద్వారా సత్తెనపల్లి నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, సంక్షేమ పథకాల విస్తరణ జరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం సహించం

**కమిషనర్ మయూర్ అశోక్**

గుంటూరు రక్షణ న్యూస్




గుంటూరు నగరంలో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, సచివాలయ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ మయూరి అశోక్ హెచ్చరించారు. సోమవారం శ్రీనగర్, పీవీస్ నగర్, వసంతరాయపురం ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల తీరును పరిశీలించారు. పలుచోట్ల పేరుకుపోయిన చెత్త, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైన్లను చూసి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర సుందరీకరణ, ప్రజారోగ్యం విషయంలో ఎటువంటి రాజీ ఉండదన్నారు. పలుమార్లు హెచ్చరికలు ఇచ్చినా ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శుల పనితీరులో మార్పు కనిపించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా పనిచేయని వారిపై క్రమశిక్షణా చర్యలు తప్పవన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ వంద శాతం జరగాలని, అలా జరిగితేనే రోడ్లపై చెత్త వేయడం తగ్గుతుందని తెలిపారు. ఒకవేళ చెత్త సేకరణ సక్రమంగా జరిగినప్పటికీ రోడ్లపై చెత్త వేస్తే భారీ జరిమానాలు విధించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్ల పక్కన పేరుకుపోయిన భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించాలని సూచించారు. నగర రహదారులపై ఆవుల సంచారం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, రోడ్లపై కనిపించే ఆవులను వెంటనే జీఎంసీ గోశాలకు తరలించాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్ నిర్వహణ పిన్ పాయింట్‌గా పక్కాగా జరగాలని, లేకపోతే సంబంధిత ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం 146వ సచివాలయంలోని ఆర్ఆర్ఆర్ (తగ్గించు--మళ్లీ వినియోగించు--పునర్వినియోగం) కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రాలను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సమర్థంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్యం అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ పర్యటనలో సానిటేషన్ సూపర్వైజర్లు సాంబయ్య, బజాక్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి బలసాని కిరణ్ కుమార్ సానుభూతి

ప్రత్తిపాడు రక్షణ న్యూస్

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం గుంటూరు రూరల్ మండలం 26వ డివిజన్ పరిధిలోని దాసరిపాలెం గ్రామంలో పార్టీ కార్యకర్త పులగం నాగేశ్వరరావు తండ్రి పులగం బుజ్జి అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బాలసాని కిరణ్ కుమార్ సోమవారం సాయంత్రం వారి నివాసానికి వెళ్లి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంటూరు రూరల్ మండల మరియు దాసరిపాలెం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.